క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



హెచ్‌ఎం వెంకటరావును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సీతంపేట: మండల కేంద్రంలోని జీహెచ్ స్కూల్ హెచ్‌ఎంగా వి.వెంకటరావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. విజయనగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేసి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా కృషి చేస్తానని చెప్పారు. హెచ్‌ఎంను ఉపాధ్యాయులు పాణిగ్రాహి, హిమగిరి, శివ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి సర్కార్ ఫెయిల్యూర్

- ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్



మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్

పార్వతీపురం: పదోతరగతి పరీక్షా ఫలితాలు ఏప్రిల్ 23న విడుదల చేయగా ఫలితాల్లో చాలా మంది విద్యార్థులు ఫెయిల్ అవడంతోపాటు మార్కులు కూడా తక్కువగా వచ్చాయని, ఆత్మహత్యా యత్నాలు విద్యార్థులు చేసుకున్న సందర్భాలు ఉన్నాయని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రవికుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ విద్యాశాఖమంత్రి నారా లోకేష్ ఎన్నడూ లేని విధంగా 22 రోజులకే ఫలితాలు విడుదల చేశామని ప్రచార ఆర్భాటంలో ఉన్న శ్రద్ధ రిజల్ట్స్‌లో జరిగిన వైఫల్యంపై దృష్టిసారించలేదన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా 66,363 మంది విద్యార్థులు రీ వ్యాల్యూయేషన్‌కు అప్లై చేసుకోగా అందులో ఇప్పటికే ఫెయిల్ అయిన 11వేల మంది పైచిలుకు విద్యార్థులు పాసవడమే కాకుండా మరికొంతమంది విద్యార్థుల మార్కుల శాతం కూడా పెరిగిందన్నారు. ఈ కారణంగా చాలా మంది విద్యార్థులు ఐఐటీ సీట్లు కూడా కోల్పోయిన పరిస్థితి రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులే స్వయంగా వారి బాధను వెళ్లబుచ్చే పరిస్థితి ఉందని రవికుమార్ గుర్తుచేశారు. కానీ ఇప్పటివరకు ఫలితాల్లో జరిగిన వైఫల్యంపై విద్యాశాఖమంత్రి ఎక్కడా స్పందించలేదని, పరిష్కారానికి అలాగే విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కనీసం ఒక్క స్టేట్‌మెంట్ కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ ఈ కూటమి సర్కార్ ఫెయిల్యూర్ అని రవికుమార్ అన్నారు.

నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- ఆదివాసీ గిరిజనసంఘం డిమాండ్

మక్కువ: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని ఆదివాసీ గిరిజనసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మక్కువ మండలంలోని శంబర, ఎర్రసామంతవలస, మార్కొండపుట్టి గ్రామాల్లో ఆదివారం జీపు జాతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర, మన్యంజిల్లా నాయకుడు రామస్వామిలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు గిరిజన ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ గిరిజన అభ్యర్థులకు అనేక హామీలు ఇచ్చిందన్నారు. మెగా డీఎస్సీ నుంచి ఏజెన్సీ ఉపాధ్యాయ పోస్టులు మినహాయించి గిరిజన ప్రాంతానికి 100శాతం గిరిజన అభ్యర్థులతో నియామకాలు చేయాలని హామీ ఇచ్చి డీఎస్సీ ప్రకటనలో గిరిజన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం రాష్ట్రవ్యాప్తంగా చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం పాలన ఏడాది గడుస్తున్నప్పటికీ, గిరిజన ప్రాంతాల్లో సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. వెంటనే పై సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం రాష్ట్రనాయకులు అశోక్, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కె.గంగు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రెండు ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌ఎంల నియామకం

సీతానగరం: విద్యాశాఖ నిర్వహించిన బదిలీల్లో భాగంగా మండలంలోని రెండు ప్రాథమిక పాఠశాలలకు నూతన ప్రధానోపాధ్యాయులు కౌన్సెలింగ్ విధానంలో నియమితులయ్యారని ఎంఈఓ జి.సూరిదేముడు తెలియ జేశారు. ఈ మేరకు స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ సూరిదేముడు ఆదివారం మాట్లాడుతూ చినభోగిలి ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎంగా సీహెచ్ మేరీగ్రేస్, నిడగల్లు ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎంగా రెడ్డి పైడిపినాయుడు నియమితులయ్యారని తెలిపారు. వారిద్దరూ జాయినింగ్ రిపోర్టు అందజేశారన్నారు.

మరిపివలస జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎంగా విజయలక్ష్మి ..

మండలంలోని మరిపివలస ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా జి.విజయలక్ష్మి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇంతవరకూ ఇన్‌చార్జి హెచ్‌ఎంగా విధులు నిర్వహించిన ఓలేటి తవిటినాయుడు నూతన హెచ్‌ఎం విజయలక్ష్మికి బాధ్యతలు అప్పగించారు.

రేషన్ కావాలంటే
గడప దిగాల్సిందే..



రేషన్ డిపో వద్ద సరకులు పొందుతున్న లబ్ధిదారులు



సిగ్నల్స్ కోసం ఈ పోస్ మెషీన్‌తో కుస్తీలు పడుతున్న డీలర్

- మరో బృహత్తర పథకానికి మంగళం..
- ఇంటి వద్దకే రేషన్ సరుకుల బట్వాడాకు ఇక చెల్లుచీటి
- గిరిశిఖర వాసులు కొండ దిగాల్సిందే
- నాడు తీరిన వేతలు ... నేటి నుంచి మళ్లీ సమస్యలు మొదలు



ఎండీయూ వాహనాలు (ఫైల్)

పాలకొండ రూరల్:

గత ప్రభుత్వంతో తమకు పోలికేంటి.. మరింత దీటుగా ప్రజలకు పాలన అందిస్తామన్న కూటమి సర్కార్ ఎన్నికల హామీలు, సూపర్ సిక్స్ అమలుకు చర్యలు చేపట్టకపోగా ఉన్నవాటిలో ఒక్కో పథకానికీ మంగళం పాడేస్తోంది. అధికారంలోకి వచ్చింది మొదలు గడప వద్దకు వచ్చే సేవలను ఒక్కొక్కటిగా దూరం చేసి కూటమి ప్రభుత్వం ప్రజలను ఇబ్బంది పెడుతోంది. ముఖ్యంగా నాటి సంక్షేమ పథకాలను రద్దు చేసి, వాటికే కొత్త పేర్లు పెట్టడంలో చూపిన ఉత్సుకత అమలు చేయడంలో మాత్రం చూపించడం లేదు. కొలువుదీరిన వెంటనే గడప వద్దకే సేవలు అదించిన వలంటీర్లను తీసేశారు. తాజాగా రేషన్ బటావ్డా బళ్లను రద్దు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి కొద్ది రోజుల్లో క్షేత్రస్థాయిలో ప్రజలకు సంక్షేమం, ఇతర రాయితీలు నేరుగా అందించారు. మధ్యవర్తులు లేకుండా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించారు. సంక్షేమ పథకాలతో పాటు కార్డుదరులకు రేషన్ సరుకులను కూడా ఇళ్ల వద్దే పంపిణీ చేశారు. కొండలు, ఏజెన్సీ ప్రాంత ప్రజలకు కూడా ఇళ్ల వద్దే సరుకులు అందేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందుకోసం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు 53 మినీ ట్రక్కులు సమకూర్చారు. కోవిడ్ ప్రబలిన సమయంలో కూడా ఎండీయూ ఆపరేటర్లు రేషన్ అందించారు. అటువంటి బృహత్తర పథకానికి కూటమి సర్కారు మంగళం పాడేసింది.

నేడు సరుకులు పొందాలంటే ...

రేషన్ పొందాలంటే ప్రస్తుతం కొండలపై నివసించే గిరిజనులు కిలోమీటర్ల కొద్దీ నడిచి కొండ దిగాల్సిందే. డిపోల ద్వారా ఆదివారం సరుకులు పంపిణీ చేయగా.. సాంకేతిక సమస్యల కారణంగా లబ్ధిదారులు ఇబ్బంది పడ్డారు. ఎండల్లో కాలినడకన డిపోల వద్దకు చేరుకున్నారు. సర్వర్ పనిచేయకపోవడంతో చాలా మంది సాయంత్రం వరకు ఉండి ఊసురోమంటూ వెనుదిరిగారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతమైన సీతంపేట మండలంలో జగతిపల్లి, ఒమ్మరివిల్లి, మొగదార, రుక్మిణిగూడ, జజ్జువ, వజ్జాయిగూడ. కుమ్మరిగండి, దాబర, ఆడలి, గులుమూరుతో పాటు 40 గిరిజన ఆవాసాల ప్రజలు కిలోమీటర్ల కొద్దీ నడిచి కొండ దిగి రావాలి. భామిని మండలంలోని మణిగ, జక్కరుగూడ, మూలగూడ, బత్తిలి కొత్తకాలనీ, రేగిడి, డోకులగూడ, నల్లరాయిగూడ, బంద్రసింగి తదితర ప్రాంతాల వారు.. వీరఘట్టం మండలంలో అచ్చపువలస, మూలలంక, గాదలంక, చినగోర, కుంబిడి ఇచ్ఛాపురం, బల్లగుడ్డి తదితర గ్రామాల లబ్ధిదారులు.. పాలకొండ మండలంలో మల్లమ్మ గూడ, డోలమడ, జంపరకోట, అక్కిరాజుపేట, చిలకలవలస, బర్న సీతంపేట, వెంకటరాయునివలస, బియ్యాలవలస, సవర గూడతో పాటు మరికొన్ని ప్రాంతాల వారు ఇబ్బందులు పడాల్సి ఉంటుంది.

నాడు రేషన్ లబ్ధిదారుల కోసం...

మండలం	రేషన్ డిపోలు	కార్డు దారులు	మంజూరైన మినీ ట్రక్కులు
పాలకొండ	63	22,919	16
భామిని	33	14,502	09
వీరఘట్టం	56	19,715	14
సీతంపేట	23	15,998	14

మన్యంలో మొదలైన రేషన్ కష్టాలు

సీతంపేట: గిరిపుత్రులకు రేషన్ కష్టాలు మొదలయ్యాయి. జి. గుమ్మడలో సిగ్నల్స్ అందక రేషన్ డీలర్ గంటల తరబడి ఈపోస్ మెషీన్‌తో కుస్తీలు పట్టాడు. దీంతో కార్డుదారులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. సీతంపేట ఏజెన్సీలో 16 చోట్ల ఆఫ్‌లైన్‌లో, 7 చోట్ల ఆన్‌లైన్‌లో ఈపోస్ మెషీన్ల ద్వారా సరుకులు ఇవ్వాల్సి ఉండగా.. మొదటి రోజు ఎక్కడా సక్రమంగా పంపిణీ జరగలేదు. ఈ విషయమై సీఎస్‌డీటీ మధుసూదనరావు వద్ద ప్రస్తావించగా కొత్త సాఫ్ట్‌వేర్ డౌన్‌లోడ్ కావడంలో కొన్ని సమస్యలు తలెత్తడం వలన ఇబ్బందులేర్పడ్డాయన్నారు.

కిలోమీటర్ల కొద్దీ నడవాలి..



రేషన్ సరుకులు పొందేందుకు మా పంచాయతీ పరధిలో ఐదు గ్రామాల ప్రజలు మూడు నుంచి ఐదు కిలోమీటర్ల మేర వచ్చి సరుకులు పొందాలి. ముఖ్యంగా వృద్ధులు ఇబ్బంది పడాల్సి ఉంటుంది. గతంలో వాహనాల ద్వారా ఇళ్ల వద్దే సరుకులు అందించేవారు. ఇప్పుడు వాహనాలు రద్దు చేశారు. ప్రజల అభిప్రాయం తెలుసుకుని వాహనాలపై నిర్ణయం తీసుకోవాల్సింది. – ఆరిక నారాయణరావు, వెంకటరాయునివలస, జంపరకోట పంచాయతీ. పాలకొండ మండలం

పాత విధానమే ఉంటే.. ఇబ్బందేంటి?



గిరి-శిఖర గ్రామాలకు రేషన్ బియ్యాన్ని బైక్‌పై తీసుకువెళ్తున్న యువకులు

జియ్యమ్మవలస రూరల్: రేషన్ కార్డుదారులకు మళ్లీ కష్టాలు ప్రారంభమయ్యాయి. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఇంటి వద్దకే రేషన్ విధానం రద్దు చేసి పాత విధానంలో రేషన్ సరుకుల పంపిణీకి కూటమి ప్రభుత్వం ఆదివారం శ్రీకారం చుట్టింది. దీంతో ఇన్నాళ్లు ఇంటి దగ్గర దర్జాగా కూర్చొని రేషన్ తీసుకున్న జనం చౌకధరల దుకాణాలకు పరుగులు తీయాల్సిన దుస్థితి ఏర్పడింది. తీరా అక్కడికి వెళ్లాక భారీ క్యూలైన్ ఉండడం, సర్వర్ సమస్యలు వంటి వాటితో గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో చంద్రబాబు సర్కారు తీరుపై లబ్ధిదారుల నుంచి పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేస్తే నష్టమేమిటి.. కొత్త విధానం తీసుకురావడం వల్ల ప్రజలను ఇబ్బంది పెట్టడం తప్ప ఇంకేమైనా ఉందా అని ప్రశ్నిస్తున్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన రేషన్ పంపిణీ విధానమే బాగుందని అభిప్రాయపడుతున్నారు. జియ్యమ్మవలస మండలంలో మొత్తం 28 డీలర్ షాపులు, నాలుగు డీఆర్ డిపోలు ఉండగా, వాటి పరిధిలో మొత్తం మొత్తం 16,349 మంది కార్డుదారులు ఉన్నారు. గిరి శిఖర గ్రామాల్లోని వారి పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉంది. కొన్ని కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లి, రేషన్ తీసుకుని నడుచుకుని రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇవేవీ ప్రభుత్వానికి పట్టనట్లు ఇంటింటి వద్దకు రేషన్ విధానం రద్దు చేసి, మళ్లీ పాత విధానాన్నే అమలు చేయడంతో కూటమి ప్రభుత్వంపై ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వాహనాల ద్వారా ఇంటింటి వద్దకు విచ్చిన రేషన్ విధానమే బాగుంది కదా.. మళ్లీ కొత్తగా ఇదేంటి తమకు కష్టాలు తెచ్చిపెట్టేందుకేనా అని నిలదీస్తున్నారు.

ఇంటి వద్దకు తెచ్చిస్తామన్నారు..



చంద్రబాబు ప్రభుత్వం వృద్ధులకు మాత్రం ఇంటి వద్దకే రేషన్ తెచ్చి ఇస్తామని చెప్పింది. అయితే జూన్ 1వ తేదీన జరిగిన రేషన్ పంపిణీలో అటువంటిది కనిపించలేదు. వృద్ధులం అంతా రేషన్ దుకాణాల వద్దకే వచ్చి సరుకులు తీసుకున్నాం. ఇంకెప్పుడు తెచ్చిస్తారు. నాకు 70 ఏళ్ల బియ్యం బరువు మోయలేను. అయినా తప్పదు. ప్రభుత్వం పని బాగోలేదు. ఇచ్చిన మాట వెంటనే నిలబెట్టుకోదు. నాన్పుతాది. –అరిక సంగమ్మ, కిడిగేసు గ్రామం, జియ్యమ్మవలస మండలం

విత్తనాల ఎంపికతోనే
అధిక దిగుబడులు



వరి పంట (ఫైల్)

- మండల వ్యవసాయాధికారి విజయభారతి

గరుగుబిల్లి: అధిక దిగుబడులు సాధించేందుకు విత్తనాల ఎంపికే ప్రధానం. మేలైన వంగడాలను ఎంపిక చేసుకుంటే చీడపీడలు రావు. పంట ఏపుగా పెరుగుతుంది. ఎంపిక చేసిన మంచి విత్తనాలతో శాస్త్రీయ పద్ధతులలో సేద్యం చేస్తే తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందని మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి తెలిపారు. ఈ నేపథ్యంలో విత్తనాల ఎంపికపై పలు సూచనలను ఆమె మాటల్లోనే... వరి పంటలో దిగుబడులను పెంచుకోవాలంటే నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. గతంలో రైతులు తాము పండించిన పంట నుంచి మంచి విత్తనాలను ఎంపిక చేసుకుని సంచులలో కట్టి గాలి, వెలుతురు తగిలేలా నిల్వ చేసుకునేవారు. ప్రస్తుత కాలంలో రైతులు విత్తనాలను తయారు చేసుకోవడమే మానేశారు. సీజన్‌లో విత్తనాలను కొనుగోలు చేసి నారుమడులను తయారు చేసుకుంటున్నారు. ప్రైవేట్ వ్యాపారుల వద్ద కొనుగోలు చేసిన కల్తీ విత్తనాల వల్ల చేను ఏపుగా పెరగకపోవడంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం చేపే అవకాశం ఉంది. లైసెన్స్ పొదిన డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలి. తప్పనిసరిగి బిల్లును అడిగి తీసుకోవాలి.

మంచి విత్తనమంటే..

శుభ్రత, నాణ్యతతో పాటు బాగా మొలకెత్తే స్వభావం కలిగి ఆరోగ్యంగా పెరిగి మంచి దిగుబడి ఇచ్చేదిగా ఉంటే దాన్ని మంచి విత్తనమంటారు. ఏ వరి వంగడమైనా దాని దిగుబడి సామర్థ్యం ఆయా విత్తనాల జన్యువుల సముదాయంపై ఆదారపడి ఉంటుంది. జన్యు స్వచ్ఛతతో పాటు వాతావరణ పరిస్థితులు, భూసారాన్ని బట్టి విత్తనాలను ఎంపికచేసుకోవాలి. విత్తనోత్పత్తి మూడు పద్ధతుల్లో జరుగుతుంది.

బ్రీడర్ విత్తనం

జన్యు స్వచ్ఛత హెచ్చుగా ఉండే ఈ విత్తనాలను శాస్త్రవేత్తల పర్యవేక్షణలో ఉత్పత్తి చేస్తారు. జన్యు స్వచ్ఛత 100 శాతం ఉంటుంది. విత్తనం సంచులకు పసుపు రంగు ట్యాగ్ ఉంటుంది.

ఫౌండేషన్ విత్తనం

బ్రీడర్ విత్తనం నుంచి శాస్త్రవేత్తల సూచనల మేరకు ఈ విత్తనాన్ని ఉత్పత్తి చేస్తారు. రైతులు ఒకసారి ఫౌండేషన్ విత్తనం సాగు చేస్తే మూడేళ్ల పాటు వాటిని విత్తనాలుగా వాడుకోవచ్చు. దీనివల్ల విత్తన ఖర్చు తగ్గుతుంది.

అలాగే దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉంటాయి. ఇవి కూడా దాదాపు 100 శాతం జన్యు స్వచ్ఛత కలిగి ఉంటాయి. విత్తన సంచులకు తెలుపు రంగు ట్యాగ్ ఉంటుంది.

ధ్రువీకరించిన విత్తనం

ఫౌండేషన్ విత్తనం నుంచి గుర్తింపు పొందిన సంస్థలు, సాంకేతిక నిపుణులు ధ్రువీకరంచిన విత్తనాలు మేలు. గింజలన్నీ పరిశుభ్రంగా ఒకే పరిమాణంలో ఉండి, బాగా మొలకెత్తే స్వభావం ఉంటాయి. ఈ విత్తనాలలో జన్యు సంబంధ స్వచ్ఛత, నాణ్యత 98 శాతం వరకు ఉంటాయి. నీలిరంగు ట్యాగ్ ఉంటుంది.

● అధ్వాన రహదారితో అవస్థలు..



పాలకొండ మండలంలోని అట్టలి వయా వాటపాగు రహదారి అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డుపై గోతులేర్పడంతో రాకపోకలకు ఇబ్బందులేర్పడుతున్నాయి. అలాగే గోతుల్లో నీరు చేరడం వల్ల దోమలు, ఈగలు వృద్ధి చెంది అంటురోగాలు ప్రబలుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– పాలకొండ రూరల్

స్పందించకుంటే ప్రమాదమే..!



నవగాం – వీరఘట్టం ప్రధాన రహదారిలో కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న వృక్షం



ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ప్రమాదకరంగా మారిన చెట్టు

పాలకొండ రూరల్: పక్క చిత్రాల్లో కనిపిస్తున్న భారీ వృక్షాలకు కాలం చెల్లింది. జీవం కోల్పోవడంతో పూర్తిగా రూపుకోల్పోయాయి. ఏ క్షణమైనా కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్ ముందరి భాగంలో ఓ భారీ చెట్టు ఎప్పుడు కూలిపోతుందోనని అటుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. చిన్న గాలి వీచినా కొమ్మలు విరిగి పడడం పరిపాటిగా మారింది. అలాగే మండలంలోని నవగాం వద్ద మరో వృక్షం పరిస్థితి కూడా ఇలానే ఉంది. ఇదే రహదారిలో వీరఘట్టం మీదుగా జిల్లా కేంద్రానికి అనేక వాహనాలు, సమీప గ్రామాల నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఉన్న చెట్టు ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి ఎటువంటి ప్రమాదాలు జరగక ముందే వాటిని తొలగించాలని ప్రయాణికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

శతశాతం ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలి



జీపు జాతా వద్ద మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): గిరిజన ప్రాంతాల్లోని ఉపాధ్యాయ ఖాళీలను శతశాతం గిరిజన నిరుద్యోగ అభ్యర్థులతో భర్తీ చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.సురేంద్ర డిమాండ్ చేశారు. ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రారంభమైన జీపు జాతా కురుపాం మండల కేంద్రంలోని రావాడ జంక్షన్ వద్దకు ఆదివారం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో గిరిజన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. గిరిజన ప్రాంతాల పోస్టులను సాధారణ ప్రాంతాల అభ్యర్థులతో భర్తీ చేసేలా చర్యలు తీసుకుంటుండడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా మెగా డీఎస్సీలోని గిరిజన పోస్టులను గిరిజనుల ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషలో కలిపి ఇవ్వాలన్నారు.

జీవో నంబరు 3ను పునరుద్ధరించడమో లేకపోతే దాని స్థానంలో మెరుగైన జీవో తీసుకురావడమో త్వరగా చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, ప్రజానాట్య మండలి జిల్లా కన్వీనర్ కోరాడ ఈశ్వరరావు, గిరిజన సంఘం నాయకుడు కె.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన

పార్వతీపురం టౌన్: జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు ఆదేశాల మేరకు మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆదివారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. జిల్లా ఎన్వీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్. టి. జగన్‌మోహన్‌రావు ఈ కార్యక్రమంలో పాల్గొని వైద్యసిబ్బందితో కలిసి మలేరియా నివారణకు సంబంధించిన నినాదాలు చేశారు. కార్యక్రమంలో డా. జగన్‌మోహన్ మాట్లాడుతూ దోమల నిర్మూలనతో మలేరియా నివారించవచ్చని వాటిపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉంటే మనందరిలో మార్పుతో సాధ్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. తద్వారా దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయన్నారు. మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి సారించాలని మారుమూల, గిరిజన గ్రామీణ ప్రాంతాల్లో జ్వర లక్షణాలు సత్వరమే గుర్తించి వైద్యసిబ్బంది పరీక్షలు నిర్వహించాలని కోరారు.

రేషన్ డిపో ప్రారంభం

పాలకొండ: మండలంలోని గోపాలపురంలో ఏర్పాటు చేసిన రేషన్ డిపోను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లబ్ధిదారులు నిత్యావసర సరుకులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కర్నేన అప్పలనాయుడు, వాకముడి అనిల్‌కుమార్, జాడ శ్రీధర్, జగదీశ్వరరావు, గంటా సంతోష్, వెన్నపు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ: రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ, తదితరులు

సద్వినియోగం చేసుకోవాలి

సీతంపేట: రేషన్ షాపులను సద్వినియోగం చేసుకోవాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని గొయిది గ్రామంలో రేషన్ డిపోను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రవణమ్మ, సిమ్మయ్య, జీసీసీ మేనేజర్ డి.కృష్ణ, సీఎస్‌డీటీ మధుసూదనరావు, కూటమి నాయకులు హెచ్.ప్రసాద్, ఐ.పవన్, ఎం.విశ్వనాథం, చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా పంపిణీ చేయాలి

వీరఘట్టం: రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. వీరఘట్టం కూరాకుల వీధిలోని రేషన్ డిపోన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చందక సత్యనారాయణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

- సుభద్ర, శివరాంపురం గ్రామాల్లో దాహం కేకలు

బలిజిపేట: మండలంలోని సుభద్ర, శివరాంపురం గ్రామాల్లో తాగునీరు అందక అల్లాడుతున్నామని, దాతల సహకారంతో ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని మహిళలు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో తాగునీరు అందకపోవడంతో పొలాల్లో ఉన్న మోటార్ల వద్ద నుంచి నీరు తెచ్చుకుంటున్నామని మహిళలు చెబుతున్నారు. గ్రామంలో బోర్లు సక్రమంగా పనిచేయడం లేదని తెలిపారు. దాతల సహకారంతో వచ్చిన ట్యాంకర్లలో నీరు కాస్త ఊరట కలిగిస్తోంద ని, అది చాలకపోవడంతో పొలంలో మోటార్ల నుండి తెచ్చుకుంటున్నామన్నారు. ఎన్ని రోజులు ఇటువంటి ఇబ్బందులు పడుతామని ఎవరిని అడిగినా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై సీపీఎం నాయకులు మన్మథరావు, సత్యం, జగన్నాథంలు మహిళలను కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించా రు. తాగునీటి సమస్య తీర్చకపోతే ఎంపీడీఓ కార్యాలయం ముట్టడిస్తామని మన్మథరావు హెచ్చరించా రు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.